# నిజాయితీతో పనిచేయండి

- నేర రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి
- రాచకొండ పోలీసులతో డీజీపీ జితేందర్

సిటీబ్యూరో, జనవరి 29(నమస్తే తెలంగాణ): విధి నిర్వహణలో పారదర్శకం, నిజాయితీ, జవాబుదారితనంగా ప్రజలతో మమేకమవుతూ నేర రహిత సమాజమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర పోలీసులు పని చేయాలని డీజీపీ జితేందర్ సూచించారు. గురువారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో కమిషనరేట్ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీ సుధీర్‌బాబుతోపాటు అన్ని విభాగాల డీసీపీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. దేశంలోని టాప్ పది రాష్ట్రాల్లో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఉన్నతాధికారులు క్రమం తప్పకుండా తమ పరిధిలో ఉన్న స్టేషన్లను ప్రత్యక్షంగా సందర్శించి సిబ్బంది పనితీరును సమీక్షించాలని, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. రోజు వారి పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, వీలైనంత తక్కువ సమయంలో బాధితుల వద్దకు పోలీసులు చేరుకోవాలన్నారు. నేరస్థులను పట్టుకోవడంలో సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ కెమెరాలను ఉపయోగించుకోవాలని, అంతర్రాష్ట్ర దొంగల ముఠాలను వెంటాడి పట్టుకోవాలని, పాత నేరస్థుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. విజిబుల్ పోలీసింగ్, ఫుట్ పెట్రోలింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.



రాచకొండ సీపీ సుధీర్‌బాబు



డీజీపీ జితేందర్

# స్థానిక ప్రణాళికలతో నేర నియంత్రణ

## డీజీపీ జితేందర్



మాట్లాడుతున్న డీజీపీ జితేందర్. చిత్రంలో కమిషనర్ సుధీర్‌బాబు

ఈనాడు- హైదరాబాద్: పోలీసు స్టేషన్ల వారీగా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకొని, నేరాలను నియంత్రించాలని డీజీపీ జితేందర్ సూచించారు. రోజువారీ పెట్రోలింగ్‌ను మరింత సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. నేరేడ్‌మెట్‌లో రాచకొండ కమిషనరేట్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. కమిషనర్ సుధీర్‌బాబుతో కలిసి అన్ని జోన్ల డీసీపీలు, అదనపు డీసీపీలతో నేర నియంత్రణపై కలిసి సమీక్షించి మాట్లాడారు. "ఉన్నతాధికారులు క్రమం తప్పకుండా వారి పరిధిలోని పోలీస్‌స్టేషన్లను సందర్శించి పనితీరుపై సమీక్షించాలి. నేరస్థులను పట్టుకోవడానికి.. దర్యాప్తులో సాంకేతిక ఆధారాలు సేకరించడం కోసం సీసీ కెమెరాలను విస్తృతంగా ఉపయోగించుకోవాలి. అంతర్రాష్ట్ర ముఠాలు.. పాత నేరస్థుల కదలికల మీద నిఘా పెట్టి మళ్లీ నేరాలకు పాల్పడకుండా చూడాలి. నూతన నేర న్యాయ చట్టాలపై ప్రతి ఒక్కరికీ సంపూర్ణ జ్ఞానం ఉండాలి. మహిళా భద్రత కోసం మరిన్ని చర్యలు తీసుకోవాలి. సమర్థ పోలీసింగ్‌లో టాప్-10 రాష్ట్రాల్లో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉండడం గర్వకారణం. ఇతర రాష్ట్రాల కంటే శాంతిభద్రతలు ఎంతో మెరుగ్గా ఉన్నాయి. 24 గంటలూ కొనసాగే పెట్రోలింగ్‌తో రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఉంటోంది. ఫలితంగా పెట్టుబడులు అధికంగా వస్తున్నాయి. తలసరి ఆదాయంలో తెలంగాణ ముందుంది' అని డీజీపీ పేర్కొన్నారు. డీసీపీలు రాజేశ్‌చంద్ర, పద్మజా, ప్రవీణ్‌కుమార్, అరవింద్ బాబు, సునీతారెడ్డి, రమణారెడ్డి, మురళీధర్, మల్లారెడ్డి, శ్రీనివాస్, ఇందిర, నాగలక్ష్మి, ఉషా విశ్వనాథ్ పాల్గొన్నారు.

# నేరరహిత సమాజమే తెలంగాణ పోలీసుల ధ్యేయం

- డిజిపి జితేందర్ వ్యాఖ్య



మన తెలంగాణ/హైదరాబాద్: రాచకొండ కమిషనరేట్ పరిధిలోని అన్ని జోన్ల డిసిపిలు, అదనపు డిసిపిలు, ఎసిపి స్థాయి అధికారులతో నేరేడ్ మెట్ లోని కమీషనర్ కార్యాలయంలో రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారుల నుండి సంబంధిత జోన్లు, అడ్మిన్, ట్రాఫిక్, క్రైమ్, ఉమెన్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, ఎస్ఓటి, రిజర్వ్ పోలీస్ వంటి విభాగాల వారీగా నేర నియంత్రణ, కేసుల విచారణ తీరు, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో వారికి ఎదురవుతున్న సమస్యలను కూలంకషంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి పలు విలువైన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డిజిపి డాక్టర్ జితేందర్ మాట్లాడుతూ ఉన్నతాధికారులు క్రమం తప్పకుండా తమ పరిధిలో ఉన్న స్టేషన్లను ప్రత్యక్షంగా సందర్శించి, వారి పనితీరు సమీక్షించాలని, తమ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకుని వాటి ప్రకారం నేర నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. సమర్థవంతమైన పోలీసు వ్యవస్థలో దేశంలోని టాప్ పది రాష్ట్రాల్లో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉండడం గర్వకారణం అని, ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణలో శాంతి భద్రతల వ్యవస్థ పటిష్టంగా ఉందని పేర్కొన్నారు. ఇకనుండి రోజువారీ పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, వీలైనంత తక్కువ సమయంలో బాధితుల వద్దకు చేరుకోవాలని సూచించారు. నేరస్తులను పట్టుకోవటంలో, నేరపరిశోధనలో, సాంకేతిక ఆధారాలను, సిసిటివి కెమెరాలను ఉపయోగించుకోవాలని అధికారులకు సూచించారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాలను వెంటాడి పట్టుకోవాలని, పాత నేరస్తుల కదలికల మీద నిఘా వేసి ఉంచాలని, వారు మళ్ళీ నేరాలకు పాల్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీసులు తమ విధి నిర్వహణలో పారదర్శకంగా, నిజాయితీగా, జవాబుదారీతనంతో ఉండాలన్నారు. అన్ని విభాగాల పోలీసులు సమన్వయంతో పనిచేయాలని, సమర్థవంతంగా పని చేసే అధికారులు, సిబ్బందికి రాష్ట్రస్థాయి పతకాలు, ప్రోత్సాహకాలు అందిస్తామని అన్నారు. ఈ సమావేశంలో సిపి సుధీర్‌బాబు, మల్కాజ్‌గిరి పద్మజ, యాదాద్రి డిసిపి రాజేష్‌చంద్ర, ఎల్‌బినగర్ డిసిపి ప్రవీణ్‌కుమార్, క్రైం డిసిపి అరవింద్ బాబు, మహేశ్వరం డిసిపి సునీతరెడ్డి, డిసిపి ఎస్ఓటి 1 రమణారెడ్డి, డిసిపి ఎస్ఓటి 2 మురళీధర్, ట్రాఫిక్ డిసిపిలు మల్లా రెడ్డి, శ్రీనివాస్, డిసిపి (అడ్మిన్) ఇందిర, సైబర్ క్రైమ్స్ డిసిపి నాగలక్ష్మి, ఉమెన్ సేఫ్టీ డిసిపి ఉషా విశ్వనాథ్, అదనపు డిసిపిలు, ఎసిపిలు, అధికారులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో జవాబుదారీతనం ఉండాలి

- నేర రహిత సమాజమే ధ్యేయం
- నేరాల తగ్గింపునకు సమన్వయంతో కృషి చేయాలి : డీజీపీ జితేందర్
- రాచకొండ కమిషనరేట్‌లో ప్రత్యేక సమీక్షా సమావేశం



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

పోలీసులు తమ విధి నిర్వహణలో పారదర్శకంగా, నిజాయితీగా, జవాబుదారీతనంతో ఉండాలని రాష్ట్ర డీజీపీ జితేందర్ అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకోవటానికి ప్రజలతో మమేకమై పని చేయాలని, విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సీపీ సుధీర్ బాబుతో డీజీపీ బుధవారం రాచకొండ కమిషనరేట్ పరిధిలోని అన్ని జోన్ల డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీ స్థాయి అధికారులతో నేరేడ్‌మెట్‌లోని పోలీస్ కమిషనరేట్‌లో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారుల నుంచి సంబంధిత జోన్లు, అడ్మిన్, ట్రాఫిక్, క్రైమ్, ఉమెన్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, ఎస్ఓటీ, రిజర్వు పోలీస్ వంటి విభాగాల వారీగా నేర నియంత్రణ, కేసుల విచారణ తీరు, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో వారికి ఎదురవుతున్న సమస్యలను కూలంకషంగా తెలుసుకుని పరిష్కారానికి పలు విలువైన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. ఉన్నతాధికారులు క్రమం తప్పకుండా తమ పరిధిలో ఉన్న స్టేషన్లను ప్రత్యక్షంగా సందర్శించి, పనితీరును సమీక్షించాలని చెప్పారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకుని వాటి ప్రకారం నేర నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. సమర్థవంతమైన పోలీసు వ్యవస్థలో దేశంలోని టాప్ పది రాష్ట్రాల్లో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉండటం గర్వకారణమని, ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణలో శాంతి భద్రతల వ్యవస్థ పటిష్టంగా ఉందని అన్నారు. ఇక్కడున్న 24 గంటల పెట్రోలింగ్ గస్తీ వంటి ఏర్పాట్ల ద్వారా నెలకొన్న ప్రశాంత వాతావరణం వల్లే రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడే పెట్టుబడులు కూడా అధికంగా వస్తున్నాయని, తలసరి ఆదాయంలో కూడా మన రాష్ట్రం ముందజలో ఉందని వివరించారు. రోజువారీ పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, వీలైనంత తక్కువ సమయంలో బాధితుల వద్దకు చేరుకోవాలని సూచించారు. నేరస్తులను పట్టుకోవటంలో, నేర పరిశోధనలో, సాంకేతిక ఆధారాలను, సీసీటీవీ కెమెరాలను ఉపయోగించుకోవాలన్నారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాలను వెంటాడి పట్టుకోవాలని, పాత నేరస్తుల కదలికల మీద నిఘా ఉంచాలన్నారు. తిరిగి వారు నేరాలకు పాల్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నూతన నేర న్యాయ చట్టాల గురించి అధికారులు, సిబ్బంది సంపూర్ణ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. చట్టపరిధిలోనే పని చేయాలని, దర్యాప్తు నిబంధనలకు అనుగుణంగా నేర పరిశోధన జరగాలని, గరిష్ట శిక్షా రేటు సాధించేలా కృషి చేయాలని సూచించారు. మహిళా సంరక్షణ కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, షీ టీమ్స్‌ను మరింత బలోపేతం చేయాలని చెప్పారు.

డ్రగ్స్ సరఫరా, వినియోగం మీద ఉక్కుపాదం మోపాలన్నారు. డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ప్రజలలో సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించేలా పలు కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ట్రాఫిక్ విభాగం ప్రాధాన్యతను వివరించారు. ట్రాఫిక్ పోలీసుల వల్లే నగరాల్లో ఎన్నో నేరాలు, రోడ్డు ప్రమాదాలు అదుపులో ఉన్నాయని డీజీపీ అభినందించారు. అన్ని విభాగాల పోలీసులు సమన్వయంతో పని చేయాలని, సమర్థవంతంగా పని చేసే అధికారులు, సిబ్బందికి రాష్ట్రస్థాయి పతకాలు, ప్రోత్సాహకాలు అందిస్తామని అన్నారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి డీసీపీ పద్మజ, యాదాద్రి డీసీపీ రాజేష్ చంద్ర, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు, మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి, డీసీపీ ఎస్ఓటి 1 రమణారెడ్డి, డీసీపీ ఎస్ఓటి 2 మురళీధర్, డీసీపీలు ట్రాఫిక్ మల్లా రెడ్డి, శ్రీనివాస్, అడ్మిన్ డీసీపీ ఇందిర, సైబర్ క్రైమ్ డీసీపీ నాగలక్ష్మి, ఉమెన్ సేఫ్టీ డీసీపీ ఉషా విశ్వనాథ్, పలువురు అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నేరరహిత సమాజమే పోలీసుల ధ్యేయం: డీజీపీ

హైదరాబాద్ సిటీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పోలీస్ ఉన్నతాధికారులు తమ పరిధిలోని పోలీస్‌స్టేషన్లను తరుచూ సందర్శించి పనితీరును సమీక్షించడంతో పాటు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించుకొని నేర నియంత్రణకు కృషి చేయాలని తెలంగాణ డీజీపీ జితేందర్ అన్నారు. నేరేడ్‌మెట్‌లోని కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీ సుధీర్‌బాబుతో వివిధ జోన్ల డీసీపీలు, ఏసీపీలతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల పనితీరును అడిగి తెలుసుకోవడంతో పాటు క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు పలు సలహాలు సూచనలు చేశారు. సమర్థవంతమైన పోలీస్ వ్యవస్థలో టాప్ 10లో తెలంగాణ ఉండటంతో పెట్టుబడులు వస్తున్నాయన్నారు.



సమావేశంలో డీజీపీ జితేందర్, సీపీ సుధీర్‌బాబు

విజబుల్ పోలీసింగ్‌కు ప్రాముఖ్యత పెంచడంతో పాటు తక్కువ సమయంలో బాధితుల వద్దకు చేరుకోవాలన్నారు. అంతరాష్ట్ర ముఠా కదలికలపై నిఘా పెట్టి నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. దర్యాప్తు నిబంధనలకు అనుగుణంగా నేర పరిశోధన జరగాలని, గరిష్ఠ శిక్షా రేటు సాధించేలా కృషి చేయాలని సూచించారు. మహిళల రక్షణకు పెద్దపీట వేయడంతో పాటు డ్రగ్స్ సరఫరా, విక్రయం, వినియోగంపై ఉక్కుపాదం మోపాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో ట్రాఫిక్ సిబ్బంది వీలైనంత త్వరగా స్పందించి క్షతగాత్రులకు సాయం చేయాలని సూచించారు. నేర నియంత్రణకు అన్ని విభాగాల పోలీసులు సమన్వయంతో పని చేయాలని, సమర్థవంతంగా పని చేసే అధికారులు, సిబ్బందికి రాష్ట్రస్థాయి పతకాలు, ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. ఈ సమన్వయ సమావేశంలో సీపీ సుధీర్ బాబు, డీసీపీలు పద్మజ, రాజేష్‌చంద్ర, ప్రవీణ్‌కుమార్, అరవింద్ బాబు, సునీతా రెడ్డి, రమణారెడ్డి, మల్లారెడ్డి, ఇందిర, నాగలక్ష్మి, ఉషావిశ్వనాథ్ పాల్గొన్నారు.